
# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్‌రాజు





## అమెరికులాసా కథ – 199

## 'అమెరి కొత్త' ఏడాది -పాత గోల

-

**మళ్ళీ ఇంకొక కొత్త ఏడాది** ...అనగా... 2025 కి మందు పార్టీలు పెట్టుకునే వారి తరఫునా, మందూ, మాకూ మాట ఎలా ఉన్నా "తప్పేదే లే" అనుకునే నా లాంటి 'మాజీల' తరఫునా సామూహికంగా స్వాగతం పలుకుదాం. అలాగే గత 2024 ఏడాదికి టాటా కూడా చెప్పేద్దాం. ఎప్పటి లాగానే 2025 లో కూడా మా కాకినాడ నేమాని వారు, పిడపర్తి వారు, తంగిరాల వారు పంచాంగాలలోనూ, ప్రతీ నగరం లోనూ ఉన్న ఆస్థాన జ్యోతిష్కులూ అక్కడ నాయుడు గారు, రేవంతు గారు, ఇక్కడ ట్రంప్ గారు జనాలని ఏం ఉద్ధరిస్తారో పేపర్లలో ప్రకటిస్తారు. టీవీలలో వినిపిస్తారు. ఇక "నలభయ్యో పడిలో పడుతున్న మా అమెరికా అమ్మాయి లేదా అబ్బాయి ఎవరో ఒకరిని కనీసం ఈ ఏడు అయినా పెళ్ళి లాంటిది చేసు కుంటారా?", "మొన్న ట్రంప్ గారు నెగ్గగానే ఆగమేఘాల మీద కొనేసుకున్న ఆయన ఆప్త మిత్రుడు ఇలాన్ మస్క్ గారి కంపెనీ స్టాకులు 2025 లో ఎంత ఎక్కువగా పెరుగునూ?" మొదలైన అమెరికా కష్టమర్ల ప్రశ్నలకి ఆన్-లైన్ లో భవిష్యత్ వాణి చెప్పే జ్యోతిష్కుల బేచ్ కి ఈ రెండు సంవత్సరాల సంధికాలం మూడు, నాలుగు వారాలూ పండగే పండగ. ఆ తర్వాత మార్చ్ లో మన ఉగాది ఎలాగా వస్తుంది.

గతం నాస్తి. వర్తమానం ఆస్తి. భవిష్యత్తు తథాస్తు. అనగా...గడిచినది అంతా గోవిందా, గోవిందా. ఇప్పుడు జరుగుతున్నదే మన ఆస్తిపాస్తులు, ఇక ముందు ఆ పై వాడు దేనికి తథాస్తు అంటే అదే మనకి ప్రాప్తం. వర్తమానం ఎలాగా అనుభవిస్తాం, 2025 ఎలాగా మన చేతిలో లేదు కదా. కాబట్టి గత ఏడాది 2024 లో జరిగిన సంగతులు కొన్ని సింహావలోకనం చేసుకుందాం అనిపించింది. ఎందుకూ అంటే అందుకే! ఏమో, ఏ పుట్టలో ఏ పాము ఉందో? చేసిన పొరపాట్లు మళ్ళీ చెయ్యకుండా కొత్త పొరపాట్లు చెయ్యడానికి, మంచి పనులేమైనా చేసి ఉంటే అవి మానెయ్యడానికి అవిడియాలు వస్తాయేమో! అందుకూ..🤪 🤪

అమెరికా నివాసిగా ఈ కొత్త సంవత్సరం మొదట్లో..జనవరి 20, 2025 న డొనల్డ్ ట్రంప్ గారి పరిపాలన ప్రారంభం అవుతుంది. రెండవ సారి పగ్గాలు చేపడుతున్న ట్రంప్ గారి ఉపాధ్యక్షుడు జె. డి. వాన్స్ గారెకి ప్రస్తుతం ఉన్న ఏకైక ప్రఖ్యాతి ఆయన భార్య తెలుగు ఆడపడుచు కావడమే. ఇది కేవలం నా అభిప్రాయం సుమా. ఇక అమెరికన్ రాజకీయాలలో 'మనోళ్ళు" ఎవరున్నారా, టాంటాం కొట్టుకుందాం అనుకునే వాట్సప్, ఫేస్ బుక్ బేచ్, ఇండియా టీవీ వాళ్ళు, పేపర్ల వాళ్ళకీ ఈ సారి పెద్ద పండగే. ఎందుకంటే భారత సంతతికి చెందిన కశ్యప్ పటేల్ ఏకంగా ఎఫ్. బి. ఐ కి డైరెక్టర్ గానూ, అంతే ప్రాముఖ్యత ఉన్న నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ గా తులసి గేబర్డ్ ని, మొత్తం అమెరికన్ ప్రభుత్వాన్ని కుదించి, ఖర్చులు తగ్గించడానికి యావత్ భూప్రపంచం లోనే అత్యధిక ధనవంతుడైన ఇలాన్ మస్క్ తో పాటు వివేక్ రామస్వామి ని ట్రంప్ నియమించారు. హర్మీత్ ధిల్లాన్ (అసిస్టెంట్ అటార్నీ జనరల్), జే భట్టాచార్య (డైరెక్టర్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్) మొదలైన మరి కొందరికి కూడా చెప్పుకోదగ్గ పదవులు లభించాయి. ఇది గర్వించ దగ్గ విషయమే కానీ ఆ మాత్రానికి ప్రముఖ భారత దేశం పత్రిక ఇండియా టుడే లో "Trump 2.0– Hindu values, Indian Americans take center stage" పతాక శీర్షికతో ప్రకటించినట్టు అంత సీన్ లేదు. వీళ్ళు అందరూ సమర్ధులే!. అమెరికన్ రాజకీయాలలో.., ముఖ్యంగా రిపబ్లికన్ పార్టీలో ట్రంప్ గారి భావజాలానికి తల ఒగ్గిన వారే. ఆయన పట్ల విధేయత చూపించిన వారే. ఈ స్థాయికి వారు రావడానికి ఇలాంటి కారణాలు ప్రధానం కానీ వాళ్ళ భారతీయ విలువలు, ట్రంప్ గారికి ఇండియా మీద, ఇండియన్స్ మీద అలవిమాలిన అభిమానం వగైరాలు కానే కాదు. ఇవన్నీ మనకి మనం మనలోనే అనేసుకునే శునకానందం టైపు ఊహాజనితాలే కానీ ట్రంప్ ఊహలు కానేకాదు.

అసలు 2025 లోనూ, తర్వాత నాలుగేళ్ల ట్రంప్ పరిపాలన లోనూ అమెరికాలో ఎటువంటి తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటాయో ఎవరికీ ఊహకి అందని విషయాలే. ఉదాహరణకి మిలియన్ల కొద్దీ అక్రమ వలసదారులనీ, ఇక్కడ పుట్టి అమెరికన్ పౌరులైన వారి కుటుంబాలతో సహా వెనక్కి పంపించి తీరతాను అని ట్రంప్ గారు ఘంటాపథంగా చెప్తున్నారు. ఇది ఎలా అమలు అరుగుతుంది? ఉదాహరణకి: ఎప్పుడో దశాబ్దాల క్రితం స్టూడెంట్ వీసా మీద ఆరేళ్ల కొడుకు యువరాజు తో అమెరికా వచ్చిన రాజు, రాణి అమెరికా చదువులు పూర్తి చేసుకుని, ఉద్యోగాలు తెచ్చుకుని యువరాజుతో సహా మొత్తం కుటుంబానికి గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేశారు కానీ పదేళ్ల పైగా ఇంకా వైటింగ్ లిస్ట్ లోనే ఉన్నారు. ఇలాంటి భారతీయులు ఇప్పుడు సుమారు 1.2 మిలియన్ మంది ఉన్నారు. యువరాజు తల్లిదండ్రుల డిపెండెంట్ వీసా మీద ఉండి హాయిగా అమెరికాలో చదువుకున్న యువరాజుకి ఇంతలోనే కొంప మునిగి పోయినట్టు 21 ఏళ్ళు నిండిపోయాయి. దాంతో ప్రస్తుతం రూల్స్ ప్రకారం యువరాజు డిపెండెంట్ వీసాకి కాలదోషం పట్టి, రాజు రాణి అతని కోసం పెట్టిన గ్రీన్ కార్డ్ అప్లికేషన్ కేన్సిల్

అయిపోయి, యువరాజు ఎటువంటి అమెరికా వీసా లేని త్రిశంకు స్వర్గం లోకి వెళ్ళిపోయాడు. అనగా...తన ఆరవ ఏట అమాయకంగా అమ్మ కొంగు పట్టుకుని అమెరికా వచ్చేసిన యువరాజు ఇప్పుడు ట్రంప్ గారి దృష్టిలో వీసా లేని అక్రమ వలసదారు. ఇలా త్రిశంకు స్వర్గంలో ఉన్న భారతీయులు సుమారు లక్షా ముఫై వేల మంది ఉన్నారు అని ఒక అంచనా. ప్రస్తుతం ఇమ్మిగ్రేషన్ రూల్స్ ప్రకారం భారతీయులకి గ్రీన్ కార్డ్ కోటా ఏడాదికి పదివేల లోపే! ఈ 2025 జనవరిలో ట్రంప్ గారు పదవి చేపట్టగానే ఈ లక్షా ముఫై వేల మంది యువతీ యువకులని మోడీ గారి దగ్గరకి "మీరే చూసుకోండి" అని వెనక్కి పంపించేస్తారా? 'మనోళ్ళు' అని మనం కాలర్ ఎగరేసుకుంటున్న ఉష చిలుకూరి వాన్స్, కాష్ పటేల్, తులసి గేబార్డ్ మొదలైన వారు వీళ్ళందరికీ వీడ్కోలు చెప్పేసి ట్రంప్ గారి దగ్గర మార్కులు కొట్టేస్తారా? పరాయి దేశాల నుంచి వచ్చినా అమెరికా విశ్వవిద్యాలయాలలో డిగ్రీ చదువు పూర్తి చేసినవారికి గ్రీన్ కార్డ్ ఇవ్వాలి అనే ట్రంప్ గారి మంచి ఆలోచన ఈ సమస్యకి ఒక విరుగుడుగా 'మనోళ్ళు" సమర్ధించగలరా? ఈ పరిస్థితి నుంచి తప్పించుకోడానికి ఉన్న మరొక మార్గం – EB 5 అనే ఇన్వెస్టర్ వీసా వెసులుబాటు. అంటే ఈ త్రిశంకు స్వర్గం యువతీ యువకులు ఐదు లక్షల డాలర్లు పెట్టుబడి పెడితే వాళ్ళు ఈ వీసా ద్వారా అమెరికాలో ఉండి గ్రీన్ కార్డ్ తెచ్చుకోవచ్చు ట. గత్యంతరం లేక మన వాళ్ళు చాలా మంది ఈ డొంక తిరుగుడు మార్గాన్ని అవలంబిస్తున్నారు. దీన్ని ట్రంప్ గారి భారతీయ అనుయాయులు గమనించి, మరి కాస్త సులభ తరం చెయ్యగలరా? ఏమో. గుర్రం ఎగరా వచ్చు!. ఈ సమస్య మీద నాకు పూర్తి అవగాహన లేదు సుమా అని ముందే మనవి చేసుకుంటున్నాను.

ఇక అక్కడ ఆంధ్రా రాజకీయాల మాటకొస్తే....2024 లో ఎవరూ ఊహించని విధంగా చంద్రబాబు నాయకత్వం లో కూటమి విజయం, పవన్ కల్యాణ్ రాజకీయంగా కూడా హీరో అవడమే కాకుండా వై.ఎస్. జగన్ అడ్రెస్ లేకుండా పోయాడు అని ముందు అంతా అనుకున్నారు. ఇహ రాష్ట్రం పొలోమని అభివృద్ధి చెందుతుంది అనేసుకుని సంబర పడేవారు చాలా మందే ఉన్నా ఆంధ్రా అభివృద్ధికి అమరావతి, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాలు పూర్తి అవడం తార్కాణాలుగా నిలుస్తాయి. అధికారానికి వచ్చిన గత వంద రోజులలోనూ కూటమి ప్రభుత్వం హడావుడి బాగానే ఉంది కానీ రెండు వేపుల నుంచీ కక్ష రాజకీయాల సంఘటనలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. అంటే...మళ్ళీ అగ్గి పూర్తి స్థాయిలో రాజుకోడానికి ఎక్కువ సమయం లేదు అనీ నా అభిప్రాయం. ఉదాహరణకి భారత దేశం బియ్యం ఎగుమతులు అత్యధికంగా జరిగే మా కాకినాడ పోర్ట్ షిప్పింగ్ కంపెనీ యజమానులు కొంత మంది నాకు వ్యక్తిగతంగా తెలిసిన వారు కావడంతో ఆ మధ్య నేను అక్కడికి వెళ్ళినప్పుడు ఆ పురోగతి నేను స్వయంగా చూసి సంబరపడి పోయాను. కానీ రేషన్ బియ్యం అక్రమ ఎగుమతుల వివాదంలో ఇరుక్కుని అక్కడ కొత్త పోర్ట్ నిర్మాణం పనులు, ఎగుమతులు బాగా తగ్గిపోతున్నట్టు వార్తలలో చూసి ఎంతో విచారంగా ఉంది.

ఇలాంటి వివాదాలలో నిజానిజాలు ఎలా ఉన్నా రాజకీయ ప్రమేయం పెరిగిన కొద్దీ కీచులాటలు గ్రామ స్థాయికి కూడా పాకుతాయి. మంచి పరిపాలన, పారిశ్రామిక, వ్యావసాయిక, ఆరోగ్య, తదితర రంగాలలో అభివృద్ధికి పాలకుల సమయం తగ్గిపోతుంది. ఈ లోగా మళ్ళీ ఎన్నికల సీజన్ మొదలయితే ఇక అంతే సంగతులు.

ఇక వ్యక్తిగతంగా....2024 మొదట్లో ..అంటే జనవరి నుంచి మార్చి నెలాఖరు దాకా సుమారు మూడు నెలలు నేనూ, మా క్వీన్ విక్టోరియా కాకినాడలోనే ఉన్నాం. యాభై ఏళ్ళ క్రితం నేను అమెరికా వచ్చేశాక అన్నాళ్ళు భారత దేశం లో గడపడం  అదే మొదటి సారి. అప్పుడు అందరి సహాయంతో కాకినాడలో నిర్వహించిన అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు ఎంతో ఘనంగా జరిగి నాకూ, తెలుగు నాట సాహితీవేత్తలకీ మహదానందం కలిగించింది. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా మొదలు పెట్టిన గత ముప్ఫై ఏళ్ళగా భారత దేశం లో నిర్వహించిన సాహిత్య కార్యక్రమాలు ఇంచుమించు అన్నీ హైదరాబాద్ కే పరిమితం అయిన నేపధ్యంలో మొదటి సారిగా ఇంత భారీ ఎత్తులో నా స్వస్థలం అయిన కాకినాడ కి సాహిత్యం రుణం కొంచెమైనా తీర్చుకో కలిగాను. వెనక్కి అమెరికా వచ్చాక జూన్ 1, 2024 న సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం లో జరిగిన స్నాతకోత్సవంలో నా తెలుగులో మాస్టర్స్ డిగ్రీ స్వయంగా అందుకోవాలీ అని కుటుంబ సమేతంగా అక్కడికి వెళ్ళడానికి అన్నీ ఏర్పాట్లూ చేసుకుంటే సరిగ్గా నాలుగు రోజుల ముందు జీర్ణకోశంలో ఒక భాగం అయిన కోలన్ అనే గొట్టాం లో రక్తస్రావం, దాని ఎమర్జెన్సీ రిపేరూ కాస్త చికాకు పెట్టాయి. అప్పటికే మధ్య ప్రాచ్య దేశాలలో మొట్టమొదటి సారిగా ఖతార్ దేశ రాజధాని దోహాలో 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు నవంబర్ 22-23 తేదీలలో నిర్వహణకి ఏర్పాట్లు మొదలు పెట్టేశాం. తీరా దోహా బయలుదేరడానికి పెట్టెలు సద్దుకోగానే ఆ దిక్కు మాలిన కోలన్ గొట్టానికి మళ్ళీ రిపేరు రావడం, ఆ ప్రయాణం రద్దు చేసుకోవడం జరిగిపోయాయి. కానీ ఆ సదస్సు విజయవంతంగా జరిగి, "పల్లకీ మోసినది దోహా నిర్వాహకులు. ఎక్కి ఊరేగింది నేను" అన్నట్టుగా నాకు కూడా పేరు వచ్చేసింది. అక్కడ కాకినాడ సదస్సుకీ, ఇక్కడ దోహా సదస్సుకీ ముఖ్య అతిథి భారత దేశం పూర్వ ఉప రాష్ట్ర పతి గౌ. వెంకయ్య నాయుడు గారే! భారత దేశం పర్యటన. రెండు భారీ సాహిత్య సదస్సులూ, రెండు "కడుపు కోత" సర్జరీలకీ ఖర్చు లెక్క చూసుకోదల్చుకో లేదు. ఎందుకంటే..కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది కదా!. గత ఆరు నెలలుగా ఎలాగా సర్జరీ మీద సర్జరీలు అవుతున్నాయి కాబట్టి పనిలో పనిగా వాచ్ మన్, మెడ లో నుంచి మెదడు లోకి రక్తప్రసారం వెళ్ళే కెరోటిడ్ రక్తనాళం లో స్టెంట్ అనే పరికరాలు కూడా పెట్టించుకుని మళ్ళీ 18 ఏళ్ళ ప్రాయానికి రెడీ అయిపోయాను.

మొత్తానికి కొన్ని అనుకున్న, మరికొన్ని అనుకోని విశేషాలతో 2024వ సంవత్సరం తొందర తొందరగానే గడిచిపోయింది. కొత్త ఏడాదికి మా కుటుంబం అంతా స్వాగతం పలకడానికి అంతకంటే తొందరగా,

సంతోషంగా ఎదురు చూస్తున్నాం. ఎందుకంటే ఇద్దరు మనవరాళ్లు శైల, లీల, మనవడు అవినాష్ తర్వాత, మరొక మనవడు జనవరి, 2025 మొదటి వారంలో పుట్టబోతున్నాడు..మా రెండో అమ్మాయి మాకు ఇచ్చే కొత్త సంవత్సరం బహుమతి.. వివరాలు...త్వరలోనే!.

**COMMENTS**